సాక్షి చిత్తూరు

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



పంటలపై ఏనుగుల దాడి

ఏనుగులు దాడి చేసి, టమాటా, మినుము పంటలను నాశనం చేసిన సంఘటన సదుం మండలంలో వెలుగుచూసింది. - 8లో



రాజనాలబండలో తిరుణాల సందడి

చౌడేపల్లె మండలంలో సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం తిరుణాల సందడి ఆరంభమైంది. - 8లో



నేడు యూపీఎస్సీ పరీక్షలు

తిరుపతిలోని మూడు కేంద్రాల్లో ఆదివారం యూపీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఆర్వో పెంచలకిషోర్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



కూరగాయలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన దాత అంజిరెడ్డి బృందం శనివారం నిత్యాన్నదానానికి విరాళం అందించారు. కూరగాయలు, బియ్యం 200 బస్తాలు(25 కిలోలు), సరుకులను విరాళంగా ఆలయ ఈఓ వాణికి అందజేశారు. దాత బృందానికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. మొత్తం 1,339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డుదారులకు బియ్యంతోపాటు చక్కెర అందించనున్నట్లు చెప్పారు. ఇందుకు గాను ప్రభుత్వం జిల్లాకు 15వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3 వేల మెట్రిక్ టన్నుల చక్కెర అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు 5కే రెడ్ రన్ మారథాన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అవగాహన కల్పిస్తూ 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. 5కే రెడ్ రన్ మారథాన్ ఆదివారం ఉదయం 5.30 గంటలకు మెసానికల్ మైదానం నుంచి ప్రారంభమై, పీవీకేఎన్ కళాశాల వరకు సాగుతుందన్నారు. 17–25 ఏళ్ల వయసు కలిగిన పురుషులు, స్త్రీలు ఇందులో పాల్గొనేందుకు అర్హులు అన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

కాణిపాకం ఈవోగా గురుప్రసాద్



కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఈవోగా గురుప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిస్తున్న వెంకటేశును రాష్ట్ర కార్యాలయానికి బదిలీచేశారు. ఈ స్థానానికి కర్నూలు జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న గురుప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లాలో 2,39,140 మందికి పింఛన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 2,39,140 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,69,298 మందికి గాను 2,39,140 మందికి పింఛన్ అందజేసినట్లు తెలిపారు. మిగిలిన 30,158 మందికి పింఛన్లు సోమవారం పంపిణీ చేస్తామన్నారు.

భయం..భయం!



కూలీ పనులు చేసి చెమటోడ్చి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఇంజినీరింగ్ కళాశాలలకు పంపుతున్నారు. ఆ కళాశాలల్లో చదువుతున్న బాలికలకు భద్రత చాలా ముఖ్యం. ఇంట్లో కంటే ఎక్కువ సమయం విద్యార్థులు కళాశాలల్లోనే గడుపుతారు. అలాంటి విద్యార్థులను ఎంతో జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత యాజమాన్యాలపై ఉంటుంది. రాష్ట్రంలోని కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల ఘటన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉలికిపాటుకు గురిచేసింది. ఈ ఘటన తర్వాత ఇంజినీరింగ్ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ఆందోళన చెందుతున్నారు.

- గుడ్లవల్లేరు కళాశాలలో హిడెన్ కెమెరాలపై ఉలికిపాటు
- ఇంజినీరింగ్ కళాశాలల్లో సర్వత్రా చర్చనీయాంశం
- భయాందోళనలో ఇంజినీరింగ్ విద్యార్థులు, తల్లిదండ్రులు
- చిత్తూరు, తిరుపతి కళాశాలల్లో భద్రత కల్పించాలంటున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలోని మరుగుదొడ్లలో హిడెన్ కెమెరాలు వెలుగులోకి రావడంతో, జిల్లాలోని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఉలికిపాటుకు గురయ్యారు. ఆ కళాశాల యాజమాన్యాన్ని, నిందితులను కాపాడేందుకు ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై విద్యార్థిలోకం మండిపడింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కువగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలే ఉన్నాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఇంజినీరింగ్ వైపు విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. పలు చోట్ల నేటికీ ర్యాగింగ్ అనే భూతం ఉన్నప్పటికీ అధిగమించి ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారు.

భద్రతపై దృష్టి పెట్టాలి

ఇంజినీరింగ్ కళాశాలల్లో భద్రతపై యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. కృష్ణా జిల్లా ఘటన కలవరింపునకు గురిచేస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. కళాశాలల్లో విద్యార్థినుల భద్రత కోసం ప్రత్యేకంగా ఫిర్యాదు సెల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ కెమెరాల లాంటి ఘటనలు చోటుచేసుకుంటే విద్యార్థినుల భవిష్యత్ ఏం అవుతుందోనన్న భయం కలుగుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలల్లోని ప్రైవసీ ప్రదేశాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచేయకుండా ప్రత్యేక జామర్లను పెట్టించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

ఇంజినీరింగ్ కళాశాలలు	14
ఇంజినీరింగ్ విద్యార్థులు	9,657
యూనివర్సిటీలు	03
యూనివర్సిటీ విద్యార్థులు	22,589
ఎంబీఏ కళాశాలలు	09
ఎంబీఏ విద్యార్థులు	2,589
ఎంసీఏ కళాశాలలు	02
ఎంసీఏ విద్యార్థులు	1,958
2 మెడికల్ కళాశాలల్లో విద్యార్థులు	1,589

సర్వత్రా చర్చనీయం

కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల ఘటన వెలుగులోకి రావడంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన చోటుచేసుకున్న వెంటనే విద్యార్థినుల తల్లిదండ్రులు భయాందోళనకు లోనయ్యారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తిరుపతి జిల్లాలో చదువుతున్న విద్యార్థినుల కళాశాలలకు తల్లిదండ్రులు పరుగులు తీశారు. తమ పిల్లల యోగక్షేమాలను తెలుసుకుని కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడే ప్రయత్నాలు చేశారు. ఇప్పటి వరకు గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఇలాంటి ఘటనలు దారుణం



గతంలో కళాశాలల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. గుడ్లవల్లేరు కళాశాల ఘటన చాలా బాధాకరం. ఈ ఘటన వల్ల నాలాంటి తల్లిదండ్రులు ఎంత మంది తల్లిడిల్లుతున్నారో. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి త్వరితగతిన తప్పు చేసిన వారిని శిక్షించాలి. అప్పుడే తల్లిదండ్రుల్లో ధైర్యం కలుగుతుంది. ఇలాంటి దారుణమైన ఘటనలు జరగకుండా కళాశాలల్లో భద్రత పెంచాలి. – చెంగారెడ్డి, విద్యార్థిని తండ్రి, చిత్తూరు జిల్లా

అమ్మాయిలకు రక్షణ ముఖ్యం



ఇంజినీరింగ్ చదువులంటే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులను వదిలి దూరప్రాంతాల్లో ఉండే ఇంజినీరింగ్ కళాశాలల్లో చదవాలంటే భయమేస్తోంది. ఎంతో మంది తల్లిదండ్రులనూ ఇదే భయం వెంటాడుతోంది. కళాశాలల్లో అమ్మాయిలకు ప్రత్యేక రక్షణ విభాగాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. – సహదేవ, విద్యార్థి తండ్రి, చిత్తూరు జిల్లా

భద్రత ముఖ్యం



కళాశాలల్లో భద్రత చాలా ముఖ్యం. నాలుగు సంవత్సరాల పాటు ఇంజినీరింగ్ విద్యను చదువుతాం. ఎక్కువగా కళాశాలల్లోనే గడుపుతాం. అలాంటి కళాశాలల్లో భద్రత కరువైతే ఏం చేయాలి. యాజమాన్యాలు అమ్మాయిల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటి ఘటనలు చూస్తే తల్లిదండ్రులు అమ్మాయిలను కళాశాలలకు ఎలా పంపుతారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – లలిత, ఇంజినీరింగ్, తిరుపతి జిల్లా

కెమెరాలు చూస్తే భయమేస్తోంది



గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో వెలుగు చూసిన రహస్య కెమెరాల ఘటన భయాందోళనకు గురిచేసింది. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నడూ జరగలేదు. కళాశాలల్లో సరైన పర్యవేక్షణ భద్రత లేకపోవడమే ప్రధాన కారణం. ఇలాంటి ఘటనల వల్ల విద్యార్థినుల భవిష్యత్ అంధకారంగా మారే పరిస్థితి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలి. – భవ్య, ఇంజినీరింగ్ విద్యార్థిని, చిత్తూరు జిల్లా

భద్రతా విభాగం అవసరం



కళాశాలల్లో ప్రత్యేకంగా భద్రతా విభాగం ఏర్పాటు చేయాలి. ఆ విభాగం నిరంతరం అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షణ చేయాలి. పర్యవేక్షణ లోపిస్తేనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయి. ఇంత దారుణం గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి. – నవ్య, ఇంజినీరింగ్ విద్యార్థిని, చిత్తూరుజిల్లా

తల్లిదండ్రులు భయపడుతున్నారు



కళాశాలకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇలాంటి ఘటనల వల్ల అమ్మాయిలను ఉన్నత చదువులకు దూరం చేస్తారు. గతంలో అమ్మాయిలను పదవ తరగతి వరకు చదివించి పెళ్లి చేసేవారు. అయితే ప్రస్తుతం ఉన్నత చదువులు చదివిస్తున్నారు. ఇలాంటి ఘటనలు తల్లిదండ్రుల్లో భయందోళన రేకెత్తిస్తోంది. మళ్లీ పాత రోజులొస్తాయన్న భయంగా ఉంది. – భారతి, ఇంజినీరింగ్ విద్యార్థిని, చిత్తూరుజిల్లా

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగులు ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శనివారం ఉద్యోగ మేళా పోస్టర్‌లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పలమనేరులోని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో 10 కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు ఉద్యోగమేళాలో పాల్గొనవచ్చన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు రూపేష్ 91609 40479, సిసింద్రీ 84658 30771ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఏకాంబరం, జిల్లా ప్లేస్‌మెంట్స్ అధికారి చైతన్య, డీఆర్‌డీఏ ఏపీఎం సెల్వరాజన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దివ్యాంగుల కోసం డ్రీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణా కేంద్రాన్ని స్థాపించామని వెల్లడించారు. ఈ శిక్షణా కేంద్రంలో వివిధ రకాల కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీపీఓ, కంప్యూటర్ అసిస్టెంట్, డీటీపీ, మ్యాను ఫ్యాక్చరింగ్, రీటైల్, హోటల్ మేనేజ్‌మెంట్, ఈ కామర్స్, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు, టైపింగ్, పర్సనల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణకు పదిపాస్, ఫెయిలైనవారు అర్హులన్నారు. 18 నుంచి 32 ఏళ్ల వయసు కలిగి 40 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 4వ తేదీన తిరుపతి జిల్లా కేంద్రంలోని రాస్ కార్యాలయంలో హాజరు కావాలని ఏడీ వెల్లడించారు.

14న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: జిల్లాలో ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. చిత్తూరులోని జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెన్నెలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించనున్న అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, మోటారు వాహన కేసులు, చెక్‌బౌన్స్, బీఎస్ఎన్ఎల్ కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. జిల్లాలో 11,384 కేసులను పరిష్కరించాలని నిర్ణయించామన్నారు. అదాలత్ విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని కోరారు.

హెల్మెట్ ధరించండి

న్యాయశాఖలో పనిచేస్తూ ద్విచక్రవాహనాలపై ప్రయాణించే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా జడ్జి ఆదేశించారు. చిత్తూరు కోర్టులో న్యాయవాదులు, న్యాయశాఖ అధికారులు, సిబ్బందితో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య పెరగడానికి హెల్మెట్ వాడకపోవడమే ప్రధాన కారణమన్నారు. హెల్మెట్ వాడకంపై రాష్ట్ర హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందనే విషయాన్ని గ్రహించాలన్నారు.

చిత్తూరు కమిషనర్‌గా నరసింహ ప్రసాద్



నరసింహప్రసాద్



విశ్వనాథ్

చిత్తూరు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు మునిసిపల్ కమిషనర్లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)ల బాధ్యతలను ఇక నుంచి ఐఏఎస్ అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పుంగనూరు కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో రాష్ట్ర డీఎంఏ కార్యాలయానికి అటాచ్ చేసిన పి.నరసింహ ప్రసాద్‌ను చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఉపాధ్యక్షులుగా ఉన్న పి.విశ్వనాథ్‌ను అనంతపురం రీజనల్ డైరెక్టర్, అప్పిలేట్ కమిషనర్‌గా నియమించారు. చిత్తూరులో కమిషనర్‌గా పనిచేస్తున్న అరుణ డెప్యుటేషన్ రద్దు చేస్తూ.. ఆమె మాతృశాఖ పంచాయతీరాజ్ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. చుడా బాధ్యతలను జాయింట్ కలెక్టర్‌కు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) బాధ్యతలను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు స్మార్ట్.. రేపు ప్రీపెయిడ్

- మొదట ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త మీటర్ల ఏర్పాటు
- తర్వాత మిగిలిన సర్వీసులు
- రీచార్జ్ చేస్తేనే ఇంట్లో వెలుగులు
- లేదా కరెంట్ కట్

చిత్తూరు కార్పొరేషన్: సాధారణంగా ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లును మరుసటి నెల చెల్లిస్తున్నారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి అపరాధరుసుం లేకుండా చెల్లించవచ్చు. అపరాధరుసుంతో మరో 15 రోజుల్లో కట్టడానికి ఎలాగో సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉంటుంది. ఇప్పటి వరకు అనుసరిస్తున్న పద్ధతి ఇదే. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నూతన విధానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది.

జీతాలకు కోట్లు

రూ.3 లక్షల జీతం తీసుకునే లైన్‌మన్‌లు ట్రాన్స్‌కో పరిధిలో వందల సంఖ్యలో ఉన్నారు. ప్రతి నెలా ట్రాన్స్‌కో జీతాలు, పింఛన్లు చెల్లించడానికి కోట్లు కావాల్సి వస్తోంది. ఇక శాఖాపరంగా అభివృద్ధి కోసం వందల కోట్లు కావాల్సి వస్తోంది. వీటికి మూలాధారం కరెంటు బిల్లుల ద్వారా వచ్చే ఆదాయమే. జిల్లాలో నెలకు రూ.360 కోట్లు విద్యుత్ బిల్లుల రూపంలో వస్తోంది. అదే స్మార్ట్ మీటర్లు పెడితే మరో రూ.20 కోట్ల వరకు బిల్లుల రూపంలో వస్తుందని అంచనా.

భవిష్యత్ అంతా ప్రీపెయిడ్

స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు బిగిస్తున్నారు. దశలవారీగా వాటిని ప్రీ పెయిడ్ మీటర్లకు మార్చనున్నారు. తర్వాత సిమ్‌కార్డు రీచార్జ్ లాగా ఎంత కావాలో అంత మొత్తం ముందుగానే డబ్బులు కట్టి వేసుకోవాలి. అర్ధరాత్రిలో పది రూపాయలు బ్యాలెన్స్ లేకపోయినా, సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఉపయోగాలు

- గతంలో మాన్యువల్ మీటర్లు ఉండేవి వాటిని చూసి రీడర్స్ బుక్‌లో రీడింగ్ రాసుకునేవారు. తర్వాత ఐఆర్‌డీఏ అంటే స్కాన్‌చేస్తే రీడింగ్ ఆటోమేటిక్ రికార్డు అవుతుంది. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు తర్వాత ప్రీపెయిడ్‌గా మారతాయి.
- వీటిని ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్లో బ్యాలెన్స్ ఏ విధంగా చూసుకుంటామో.. ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా బంద్ అవుతుంది. రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయి.
- బ్యాలెన్స్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చు.

నష్టాలూ..

- విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బేనని చెప్పొచ్చు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏ మాత్రం అలసత్వం వహించినా, సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



చిత్తూరులో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్


ప్రభుత్వ బకాయిలు రూ.1500 కోట్లు

ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలు, వీధి దీపాలు, వాటర్ వర్క్స్ కలిపి మొత్తం 50 వేల సర్వీసులు ఉన్నాయి. వీటి పరంగా ఇప్పటి వరకు రూ.1500 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. ఎక్కువగా పేరుకుపోయిన పంచాయతీ బకాయిల కోసం ఆర్థిక సంఘం నిధులు వచ్చినప్పుడు విన్నవించుకున్న ఆశించిన స్థాయిలో ఫలితం లేదు. ప్రభుత్వ కార్యాలయాలే కదా కరెంటు కట్ చేయరు అనే నమ్మకం ఏర్పడడంతో అవి మొండి బకాయిలుగా మారాయి.

దశలవారీగా అమలు

స్మార్ట్‌మీటర్లను దశలవారీగా అన్ని సర్వీసులకు అమలు చేయనున్నాం. తొలిదశలో ప్రభుత్వ సర్వీసులకు మీటర్లను పెడుతున్నాం. తర్వాత పరిశ్రమలు, గృహ సర్వీసులకు ఏర్పాటు చేయనున్నాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన సరఫరాను వినియోగదారులు పొందుతారు. – సురేంద్రనాయుడు, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

‘పెద్దబాల శిక్ష’కు ప్రశంస



పుస్తకం ఆవిష్కరిస్తున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి రూపొందించిన పెద్దబాల శిక్ష పుస్తకం బాగుందని డీఈఓ దేవరాజు ప్రశంసించారు. శనివారం డీఈఓ కార్యాలయంలో పెద్దబాల శిక్ష పుస్తకం ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ముద్రించిన పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయాలన్నారు. పాఠశాల స్థాయి పిల్లలకు విజ్ఞాన సర్వసంలా పెద్దబాల శిక్ష ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యంగా తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో కొలమాసనపల్లె హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు, ఎంఈఓలు బాలసుందరం, ప్రసాద్, ఏసీఎంఓ జయప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్: నగరంలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం వెలుగు చూసింది. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు, మార్కెట్‌చౌక్‌కు చెందిన పి.హరినాథ్ గుప్త (56) హోల్‌సేల్ సిగరెట్ల వ్యాపారం చేస్తున్నాడు. ఉదయం 6.30 గంటల సమయంలో తేనె బండ రోడ్డులో ఉన్న తన కారుషెడ్డు వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తన కారు డ్రైవర్‌కు ఫోన్‌చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. అప్పటికే ఓ బాటిల్‌లో వెంట తెచ్చుకున్న పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఘటనా స్థలం నిర్మానుష్య ప్రదేశం కావడంతో హరినాథ్ అక్కడికక్కడే చనిపోయాడు. ఈ దృశ్యాలన్నీ కారు షెడ్డులో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

పంటలపై ఏనుగుల దాడి

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ పరిధిలో ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి దాడి చేసి, పంటలను నాశనం చేసినట్టు రైతులు తెలిపారు. వాటి దాడిలో ప్రకాష్ రెడ్డి, మదన్, పురుషోత్తం రెడ్డికి చెందిన టమాటా, అనప, మినుము పంటలను నాశనం అయినట్టు చెప్పారు. తరచూ ఏనుగుల దాడులతో పంటలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కారు ఢీకొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన మక్బూల్ అలీ

చిత్తూరు అర్బన్: కారు ఢీకొని స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన చిత్తూరు నగరంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కొంగారెడ్డిపల్లెకు చెందిన మక్బూల్ అలీ (59) కోళ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన శనివారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా, వెనుకవైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడ్డ అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగులు.. ఆరోగ్య సిరులు

నేటి సమాజంలో ఆరోగ్య రక్షణకే తొలి ప్రాధాన్యమిస్తున్నారు. శరీర బరువును అదుపులో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సంక్రమించిన రోగాలను కట్టడి చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అందులో భాగంగా ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. కంటికి నచ్చిన పదార్థాలను ఆరగించేయకుండా స్వీయ నియంత్రణ పాటిస్తున్నారు. జిహ్వా చాపల్యం తగ్గించుకుంటూ జీవనశైలిని మార్చుకుంటున్నారు.



తిరుపతి సిటీ: ఒకప్పుడు నిరుపేదల ఆకలిని తీర్చిన రాగిముద్దకు మళ్లీ మహర్దశ పట్టింది. ఆధునిక సమాజం ఆరోగ్యం కోసం రాగిపిండి వంటకాల వైపు చూస్తోంది. మూడుపూటలా చిరుధాన్యాలను తినేందుకు మొగ్గు చూపుతోంది. పాశ్చాత్య జీవనశైలి మనిషి ఆహారపు అలవాట్లపై తీవ్రమైన ప్రభావం చూపింది. ఫలితంగా స్థూలకాయం, క్యాన్సర్, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ రోగాల నుంచి విముక్తి పొందేందుకు పాతతరం ఆహారపు అలవాట్లపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు. శాస్త్ర పరిశోధనా రంగాలు, వైద్యులు సైతం చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాగి ముద్దకు ప్రాధాన్యత పెరిగింది.

ప్రయోజనాలు ఎన్నో..!

- రాగిలో కనిపించే ప్రధాన ప్రొటీన్ ఎలుసినియన్. ఇది పోషకాహారలోపాలను నివారిస్తుంది
- శరీరానికి ఆక్సిజన్ సరఫరాకు ఉపయోగపడుతుంది
- షుగర్ కంట్రోల్ చేస్తుంది
- పిల్లల ఎదుగుదలకు సాయం చేస్తుంది
- మెగ్నీషియం, పాస్పరస్ అధికంగా ఉండటంతో శరీరానికి మంచిది
- గుండె కండరాలు, పనితీరు మెరుగుపరుస్తుంది
- రక్తహీనత, ఎముకలు, దంతాల పటిష్టతలో ప్రధాన భూమిక పోషిస్తుంది
- ఆరోగ్యకరమైన చర్మం, వెంట్రుకలకు సహకరిస్తుంది
- మలబద్ధకం నివారించి, మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది

అందుబాటులో అనేక పదార్థాలు





ప్రస్తుతం చిన్న దుకాణం నుంచి పెద్ద సూపర్ మార్కెట్లలో పలు రకాల రాగి పదార్థాలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రధానంగా రాగి పిండితో చేసిన లడ్డూలు, రొట్టెలు, మరమరాలు, స్వీట్లు, బిస్కెట్లు దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు పార్కులు, జనసంచార ప్రదేశాలలోనూ, ప్రధాన కూడళ్లలో రాగి మాల్ట్ స్టాళ్లు కనిపిస్తున్నాయి. అందులో రాగి జావ, అంబలివిక్రయిస్తున్నారు. అలాగే రాగి పిండి, చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి మాల్ట్ ఇబ్బడిముబ్బడిగా దొరుకుతోంది. ప్రధాన మిల్లెట్ హోటళ్లలో రాగి పిండితో చేసిన ఇడ్లీ, దోసె, పాయసం, పొంగల్, ఉప్మా, పెసరట్టు వంటివి యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఫైవ్‌స్టార్ హోటళ్లలో సైతం రాగి టీ, స్మూతీ, బాల్, బర్ఫీ, చపాతీ, వడ, హల్వా అంటూ పలు రకాల వంటకాలను లభ్యమవుతున్నాయి.

అతిగా తీసుకుంటే మాత్రం..



- రాగులను ఆహారంలో అధికంగా తీసుకుంటే దుష్ప్రభావాలు తలెత్తుతాయి
- కడుపు ఉబ్బరం, గ్యాస్ట్రిక్ సమస్య, డయేరియా వచ్చే అవకాముంటుంది
- మూత్రపిండాలలో రాళ్లు, మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు దూరంగా ఉండాలి
- బరువు పెరగాలనుకునేవారు తక్కువ మోతాదులో తీసుకోవాలి
- అలర్జీ వ్యాధిగ్రస్తులు దూరంగా ఉండడం మంచిది



మిల్లెట్ హోటల్లో రాగి దోశలు

ఆరోగ్య ప్రసాదంగా పరిశోధనలలో వెల్లడి

జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందినసంస్థలు సైతం రాగుల వాడకంపై పలు మార్లు పరిశోధనలు చేశాయి. ఆరోగ్య ప్రసాదరంగా పేర్కొన్నాయి. రోగనిరోధక శక్తిని పెంచే పదార్థాలలో ఒకటిగా రాగులను గుర్తించాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా రాగిపంట సాగు 2021 నుంచి 28 శాతం పెరిగినట్లు వ్యవసాయ పరిశోధనా సంస్థలు తమ వార్షిక గణాంకాలలో వివరించాయి.

నయా ట్రెండ్ రాగి బాల్

వివాహాది శుభకార్యాలలో రాగిముద్దకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఫంక్షన్‌కు హాజరైన స్నేహితులు, బంధువులు రాగిముద్ద వైపే మొగ్గు చూపుతున్నారు. నాన్ వెజ్ ప్రియులకు ప్రత్యేక కౌంటర్ ద్వారా రాగిముద్ద, చికెన్, పాయా, తలకూర వంటివి సర్వ్ చేస్తున్నారు. నగరంలోని ప్రధాన కేటరింగ్ సర్వీస్ సెంటర్లు సైతం రాగి బాల్ విత్ చికెన్ ఐటమ్‌ను తమ మెనూలో చేర్చుతుండడం విశేషం.



విక్రయానికి ఉంచిన రాగి పొంగడాలు

శరీరానికి మంచిది



రాగులు మానవ ఆరోగ్య సంరక్షణలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. శరీరానికి కావలసిన కాల్షియం లభిస్తుంది. రాగులలో పోషకాహార ప్రొఫైల్ ఉండడంతో పాటు విటమిన్లు, మినరల్స్, కార్బొహైడ్రేట్‌లు, ప్రధానంగా కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. దీంతో పాటు కార్బొహైడ్రేడ్స్ తక్కువగా ఉండడంతో షుగర్ వ్యాధి నియంత్రణకు ఉపయోగపడుతుంది.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్, ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల, తిరుపతి

వ్యాధులకు చెక్ పెట్టవచ్చు



రాగి పదార్థాలు పలు రకాలుగా తయారు చేసి చిన్నపిల్లలకు పెట్టడం వల్ల హైట్ పెరగడంతో పాటు కాల్షియం, ఫెబర్ పుష్కలంగా లభిస్తాయి. పెద్దలకు సైతం ఆధునిక కాలంలో వచ్చే అనేక వ్యాధుల బారిన పడకుండా చెక్ పెట్టవచ్చు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాగులు వంటి చిరుధాన్య పంటలకు ప్రసిద్ధి. రక్తహీనత, మానసిక రుగ్మతలకు రాగి ముద్ద, జావ వంటి పదార్థాలతో నియంత్రించవచ్చు. డయాబెటీస్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచిది.

– కేవీ సుచరిత, ప్రొఫెసర్, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ విభాగం, తిరుపతి

రాజనాలబండలో తిరుణాల సందడి

- ప్రత్యేక పూజలందుకొన్న వీరాంజనేయస్వామి
- లక్ష్మీనరసింహస్వామికి మొక్కులు చెల్లించిన భక్తులు
- తిరుణాలకు ముస్తాబైన ఆలయం



ప్రత్యేక పూజలందుకొన్న వీరాంజనేయస్వామి

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం నుంచి తిరుణాళ సందడి మొదలైంది. పూర్వీకుల నుంచి శ్రావణమాసపు చివరి శని, ఆదివారాల్లో భక్తి శ్రద్ధలతో వైభవంగా తిరుణాలను నిర్వహించడం ఆనాటి నుంచి నేటికీ సంప్రదాయంగా వస్తోంది. తిరుణాళను పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అధికారుల బృందం ఆలయాన్ని విద్యుత్‌దీపాలు , పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేయించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తోపులాటలు జరగకుండా ప్రత్యేక క్యూలను ఏర్పాటుచేశారు. మండలంలోని ప్రజలు శనివారం భక్తి శ్రద్ధలతో రాజనాలబండకు చేరుకొని శ్రీ వీరాంజనేయస్వామికు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడనుంచి పక్కనే ఉన్న ఏడు కిలోమీటర్ల కొండపై వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయానికి కాలినడకన సుమారు 3 వేల మెటికలమార్గంలో చేరుకుని భక్తులు లక్ష్మీనరసింహస్వామి వారి స్వయంభు విగ్రహానికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేసి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కొండపై వెలసిన ఆహ్లాదరకమైన వాతావారణం నడుమ సేద తీరారు. అనంతరం కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి అఖండ దీపారాధన చేశారు. రాజనాలబండ ఆలయం, లక్ష్మీనరసింహస్వామి కొండపైకి నడచి వెళ్తున్న భక్తులకు జీఆర్ఎస్ రమణ యూత్, ఎస్ఎల్ఎన్ఎస్ యూత్‌ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



నరసింహస్వామి కొండ పై భక్తుల రద్దీ

తిరుపతి, చిత్తూరులో సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న కెవి.సురేంద్రనాయుడును తిరుపతి జిల్లా పుత్తూరు అర్బన్ స్టేషన్‌కు, రాయచోటి వీఆర్‌లో ఉన్న ఎస్.రవీంద్రనాథ్‌ను తిరుపతి సీసీఎస్‌కు బదిలీ చేశారు. అలాగే తిరుపతి సైబర్ సెల్‌లో ఉన్న జి.అమర్‌నాథ్‌రెడ్డిని చిత్తూరు వీఆర్‌కు, నంద్యాల సీసీఎస్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ట్రాఫిక్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న జె.జయానాయక్‌ను రాయదుర్గానికి, తిరుపతి వీఆర్‌లో ఉన్న తమీమ్ అహ్మద్‌ను తిరుపతి మహిళా స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

నేడు యూపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ పరీక్షలకు అన్ని వసతులు కల్పించాలని డీఆర్వో పెంచల కిషోర్ ఆదేశించారు. ఆయన శనివారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం తిరుపతి నగరంలోని మూడు కేంద్రాల్లో యూపీఎస్సీ ఆధ్వర్యంలో నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, నావల్ అకాడెమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణితం పేపర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సెషన్ ఎబిలిటీ పేపర్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. అలాగే కంబైండ్ డిఫెన్స్ సర్వీసెస్‌కు చెందిన ఇంగ్లీష్ పేపర్ ఉదయం 9 గంటల నుంచి 11 వరకు, జనరల్ నాలెడ్జ్ పేపర్ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, ఎలిమెంటరీ గణితం పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా భద్రతతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎలక్ట్రికల్ వస్తువులకు అనుమతి లేదని వెల్లడించారు. శ్రీపద్మావతి బాలికల హైస్కూల్‌లో ఒక సెంటర్, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో పరీక్షలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ శశిభూషణ్, తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, సెట్విన్ సీఈవో మురళీకృష్ణ పాల్గొన్నారు.